పి. బజోవ్

వెండి గిట్ట

అనువాదం: ఆర్వియార్
చిత్రాలు: ఎ. ప్లాక్‌సిన్

"రాదుగ" ప్రచురణాలయం·మాస్కో
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

మా వూళ్లో కొకొవాన్య అని ఓ ముసలాయన వుండేవాడు. అతనికి నా అన్న వాళ్లెవరూ మిగల్లేదు. అంచేత ఓ అనాధని తెచ్చుకుని తన కన్న సంతానంలాగా పెంచుకుందామని అతనికి అనిపించింది.

మీ యెరుకలో యెవళ్లేనా అనాధలున్నారా అని అతను యిరుగింటి వాళ్లనీ పొరుగింటి వాళ్లనీ వాకబు చేశాడు.

“లేకేం, గ్లింకా పేటలోని గ్రిగోరీ పొతాపొయెవ్ పిల్లలు అనాధలై పోయారు. అదీ యీ మధ్య నుంచే. మన వూరి మునసబుగారు పెద్ద పిల్లల్ని కుట్లు లేసులు నేర్పే చోటకి పంపేరు. చిన్న పిల్ల ఆరేళ్ల అమ్మాయి వుండిపోయింది. ఆ పిల్లని యెవళ్లూ తీసికెళ్లలేదు. నువ్వు ఆ అమ్మాయిని తీసుకెళ్లచ్చు” అని వాళ్లు చెప్పేరు.

“కాని నాకు ఆడపిల్లవల్ల చెయ్యి ఆసరా వుండదు. మొగపిల్లాడైతే బాగుంటుంది. వాడికి నా చేతిలో వున్న పని నేర్పుతాను, వాడు నాకు చెయ్యి ఆసరా వుంటాడు, పెద్దయేక. కాని ఆడపిల్లవల్ల యేం లాభం? దానికి నేనేం నేర్పగలను?” అన్నాడు కొకొవాన్య.

అలా అన్నాడేగాని మళ్లీ దీనంతటి గురించీ ఆలోచన చేశాడు.

“నాకు గ్రిగోరీ, అతని సాధుశీలురాలైన భార్యా కూడా తెలుసు. కష్టపడి పని చేసేవాళ్లు, మంచి వాళ్లు. యీ పిల్లకి వాళ్ల పోలికలు వస్తే ఫరవాలేదు. యీ అమ్మాయిని చేరదీస్తాను. యింతకీ వస్తుందో రాదో?” అన్నాడు.

“అయ్యో, పాపం, దాని బతుకేం పూలపాన్పులా లేదయ్యోయ్” అని ఇరుగుపొరుగు వాళ్లు అతనికి చెప్పేరు. “మునసబుగారు గ్రిగోరీ యింటిని వో పేద పిశాచానికి యిచ్చేడు. యీ అనాథ పిల్ల పెద్దయేదాకా చూడమని చెప్పేడు. కాని వాడికే కుచేల సంతానం వుంది. వాళ్లకే ముద్దకి కటకటగా వుంది. యిక వాడి పెళ్లాం యీ దిక్కూ మొక్కూలేని పిల్లని అస్తమానూ సతాయిస్తూనే వుంది. పిసరు మెతుకు విదపడానికి విసుక్కుంటుంది. పాపం పసిపిల్లే అయినా ఆ మాత్రం బోధపడే శక్తి వుంది. ఆ పిల్లకి బాధ తెలుసు. ఆ కొంప లోనుంచి విరగడైపోతానూ అని అంటోంది. నువ్వెళ్లి అడుగు, నీతో వస్తుంది” అని చెప్పేరు.

“నిజమే ఆ ముక్క. నేను ఆ పిల్లతో గోముగా మాట్లాడతాను” అన్నాడు కొకొవాన్య.

వో సెలవు రోజున అతను ఆ పిల్ల వుంటూ వున్న చోటుకి వెళ్లేడు. ఆ యింటినిండా పెద్దా పిన్నా బోలెడు మంది వున్నారు. ఓ చిన్న పిల్ల పొయ్యి పక్కన జేగురు రంగు పిల్లిని నిమురుతూ కూర్చుంది. ఆ పిల్ల చిన్న పిల్ల, ఆమె నిమురుతూ వున్న పిల్లీ చిన్నగానే వుంది. ఆ పిల్లి యెంత సన్నగా యెడ్డిగా వుందో చెప్పలేం. అసలు యెవళ్లైనా దాన్ని యింట్లో చేర

దియ్యడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ అమ్మాయి ఆ పిల్లిని నిమురుతూ వుంటే అది గుర్ మంటోంది. దాని కూత యిల్లంతా వినిపిస్తోంది.

కొకొవాన్య ఆ పిల్లకేసి చూసి "యిదేనా గ్రిగోరీ యిచ్చిన కానుక?" అని అడిగేడు.

"ఆఁ, అదే యిది" అని యింటావిడ సణిగింది. "తను చాలదన్నట్టు మెడకో డోలులాగా ఆ పిల్లిపిల్ల వొకటి కూడా మేతకి. యీ పిల్లిపిల్లని వదిలించుకోలేకుండా వున్నాం. అది మా పిల్లల్ని గీరుతూ రక్కుతూ వుంటుంది. యికపోతే ఖర్మ దానికి తిండి పెట్టాలి" అంది.

"మీ పిల్లలు దాన్ని ఉడికిస్తున్నారేమో. ఆ పిల్ల దగ్గర గోముగానే వుంటుంది" అన్నాడు కొకొవాన్య.

తర్వాత అతను ఆ పిల్లకేసి తిరిగి

"వూ, పొదార్యోంకా*, యేం, నా దగ్గరికి వచ్చి నాతో వుంటావా?" అని అడిగేడు.

ఆ పిల్ల గుడ్లు అంత చేసి చూసింది.

"నా పేరు దార్యోంకా అని మీకెలా తెలుసు?"

"వూరికే. నేను యేమీ అనుకోకుండా, తెలియకుండా వూరికే అలా పిలిచేసేనంతే" అన్నాడతను.

"కాని మీరెవరు?" అని ఆ పిల్ల అడిగింది.

"ఓ మాదిరి వేటగాణ్ణి. వేసవికాలంలో యిసిక దాబరా గిన్నెలో నీళ్లల్లో వొడబోసి బంగారం దొరుకుతుందేమో చూస్తాను. శీతకట్టులో అడివిలోకి వెళ్లి మేక దొరుకుతుందే

---

* చిరుకానక (రష్యన్).

మోనని చూస్తాను. కాని దాని జాడైనా దొరకదు'' అన్నాడు.

''దొరికితే దాన్ని కాల్చేస్తారా?''

''అబ్బే'' అన్నాడు కొకొవాన్య. ''నేను మామూలు మేకల్ని కాలుస్తా. కాని దాన్ని కాదు. అది దాని ముందు కుడికాలు యెక్కడ ఆన్చుతుందో చూడాలని'' అన్నాడు.

''యెందుకు?''

''వచ్చి నా దగ్గర వుండు. దాన్ని గురించి మొత్తం చెపుతా'' అన్నాడు కొకొవాన్య.

ఆ చిన్న పిల్లకి ఆ మేక గురించి వినాలని చాలా యిదిగా వుంది. అతను మంచి సరదా అయిన ముసలతనిలాగే కనిపించేడు. అందుకని ఆమె అతనితో

''సరే వస్తా, కాని యీ పిల్లిపిల్లనీ నాతో తెచ్చుకుంటా. చూడండి యెంత మంచిదో యిది'' అంది.

“అయ్యొయ్యో యెందుకు మంచిది కాదు. చక్కగా పాడే యిలాంటి పిల్లిని బదుద్ధాయి యెవడో వదులుకుంటాడు. యిది మా యింట్లో బాలలైకా వాయిద్యం అంత బాగుంటుంది” అన్నాడు కొకొవాన్య.

యింటావిడ వాళ్ల మాటలు వింది. ఆ అనాథ పక్షిని వదిలించుకుని చేతులు కడు క్కోవడంకంటే సంతోషంగా వుండేది మరోటి లేదు. ఆమె దార్యోంకా వస్తువుల్ని గబ గబ సర్దడం మొదలెట్టింది. కొకొవాన్య మనసు మార్చుకుంటాడేమోనని ఆమెకి భయం కలిగింది.

పిల్లి కూడా విషయం మొత్తం గ్రహించినట్టే వుంది. అది వాళ్ల కాళ్లమీద రాసు కుంటూ

"అ...వును! స...స్స...రిగా వుంది" అని గుర్‌మంది.

అలా కొకొవాన్య అనాథ పిల్లని యింటికి తీసుకెళ్లాడు.

అతను పొడగరి. అతనికి గడ్డం వుంది. ఆమె చిన్నది. ఆమెకి చప్పిడి ముక్కు. వాళ్లి ద్దరూ రోడ్డుమీద వెళ్లారు. బురద కొట్టుకుని పిల్లి వాళ్ల వెనకాల యీడ్చుకుంటూ వెళ్లింది.

ఆ రకంగా కొకొవాన్య, అనాథ దార్యోంకా, పిల్లి కలిసి జీవించడం మొదలైంది. రోజులు గడిచేయి. వాళ్లు ధనవంతులు కాలేదు కాని వున్నదాంతో యెవళ్లకీ లోటు లేకుండా తిండికి లోపం లేకుండా గడిచింది.

పొద్దున్నే కొకొవాన్య పనిలోకి వెళ్లేవాడు. దార్యోంకా యిల్లు వూడ్చి శుభ్రం చేసేది. సూప్, పాయసం వండేది. పిల్లి చుంచుల్ని వేటాడేది. సాయంత్రం పూట యింటి దగ్గర హాయిగా సరదాగా కలిసి కాలక్షేపం చేసేవాళ్లు.

ముసలతను పిట్ట కథలు అద్భుతంగా చెప్పేవాడు. దార్యోంకా కథలంటే చెవి కోసు కునేది. పిల్లి గుర్‌మంటూ పడుకునేది, "అవును... స...స్సరిగా వుంది" అంటూ.

కాని కథ అయిపోతూనే దార్యోంకా



"వూ, యిప్పుడు మేకని గురించి చెప్పు తాతా! యెలా వుంటుంది అది?" అని గుర్తు చేస్తూ అడిగేది.

మొదట్లో కొకొవాన్య తరవాత తరవాత చెప్తా అనేవాడు. కాని వో సారి చెప్పేడు.

"అది అలాంటి యిలాంటి మేక కాదు. దాని పద్ధతే వేరు. దాని ముందు కుడి కాలుకి వెండి గిట్ట వుంటుంది. ఒక సారి ఆ గిట్టతో నేలమీద తాడిస్తే వో వజ్రం అక్కడ వూడి పడుతుంది. రెండు సార్లు తాడిస్తే రెండు వజ్రాలు వస్తాయి. నేలమీద ఆ గిట్టతో అది బరికితే గనక అబ్బో గుట్ట వజ్రాలు పోగవుతాయి" అని చెప్పేడు.

అతను చెప్పాడేగాని తరువాత యెందుకు చెప్పానా అని నాలిక కరుచుకున్నాడు. యేమంటే ఆ తర్వాత దార్యోంకా మేకపిల్ల గురించి తప్ప దేన్ని గురించీ అడిగేది కాదు.

"తాతా, అది పెద్ద మేకా?"

అది బల్లకంటే యెక్కువ యెత్తు వుండదని, దాని కాళ్ళు సన్నగా వుంటాయని, తల చక్కగా వుంటుందని కొకొవాన్య చెప్పేడు.

"అయితే తాతా దానికి కొమ్ములున్నాయా?" అని దార్యోంకా అడిగేది.

"అయ్యో, లేకేం, చక్కని కొమ్ములున్నాయి. మామూలు మేకలకి రెండు కొమ్ములే వుంటాయి. కాని దీనికి జింక కొమ్ములున్నాయి, అయిదు చిలువల కొమ్ములు."

"అది ఏ జంతువుల్నైనా తింటుందా, తాతా."

"వూహు, అది యే జంతువునీ తినదు. ఆకుల్నీ, గడ్డినీ తింటుంది. శీతాకాలంలో గడ్డి మేట్లల్లో వుండే గడ్డిని కొంచెం కొరుకుతుంది."

"దాని రంగు యెలా వుంటుంది?"

"వేసవికాలంలో పిల్లిలాగా జేగురు రంగులో వుంటుంది, శీతాకాలంలో వెండి తెలుపులో వుంటుంది."

"అది వాసన కొడ్తుందా?"

కొకొవాన్యకి కోపం వచ్చింది.

‘‘చెడ్డ వాసన పెంపుడు మేకలకి వుంటుంది. అది అడివి మేక. అంచేత దానికి అడివి గుబాళింపు వుంటుంది’’ అని చెప్పేడు.

ఆకురాలుకాలం వచ్చింది. కొకొవాన్య అడివిలోకి వెళ్లడానికి తయారయేడు. మేకలు మేత మేసే చోటు వెతకాలనుకున్నాడు. కాని అప్పుడు దార్యోంకా బతిమాలాడ్డం, ప్రాధేయ పడ్డం మొదలుపెట్టింది.

‘‘నన్నూ నీతో కూడా తీసుకెళ్లు తాతా, నేనూ ఆ మేక యెలా వుంటుందో కనీసం దూరం నుంచేనా చూస్తాను’’ అంది.



"దూరం అయితే నీకు ఆనవాలు తెలీదు. అన్ని మేకలకీ ఆకురాలు కాలంలో కొమ్ములుంటాయి. యెన్ని చిలవలు వున్నాయో తెలీదు నీకు. శీతాకాలంలో అయితే వేరు. మామూలు మేకలకి అప్పుడు కొమ్ములుండవు. కాని వెండి గిట్ట మేకకి యెప్పుడూ కొమ్ములుంటాయి. అంచేత దూరం నుంచేనా నీకు తెలుస్తుంది" అన్నాడు కొకొవాన్య.

అలా ఆమెని బుజ్జగించేడు. దార్యోంకా యింటి దగ్గర వుండిపోయింది. కొకొవాన్య అడివిలోకి వెళ్లేడు.

అయిదో రోజున తిరిగివచ్చేడు.

"యీ యేడాది చాలా మేకలు పోల్దెనేవ్‌స్క్ వేపు మేతకి వెడుతున్నాయి. యీ శీతా కాలంలో అక్కడికి వెడతాను" అన్నాడతను.

"కాని శీతాకాలంలో అడివిలో యెలా పడుకుంటావు?" అని దార్యోంకా అడిగింది.

"అక్కడో చిన్న గుడిసె వుందిలే. మనం గడ్డి కోతకి వెళ్లే లోయ దగ్గర. గట్టిగా వుండే గుడిసె, కిటికీ వుంది. చలికి నెగడు వుంది. అక్కడ బాగా వుంటుంది నాకు" అన్నాడు.

అప్పుడు దార్యోంకా మళ్లీ మొదలుపెట్టింది:

"వెండి గిట్ట అక్కడా మేస్తుందా?"

"యేమో యెవళ్లకి తెలుసు? మెయ్యొచ్చు."

అప్పుడు ఆ పిల్ల మళ్లీ బతిమలాడ్డం ప్రాధేయపడ్డం మొదలుపెట్టింది.

"నన్నూ నీతో తీసుకెళ్లు తాతా, నేను గుడిసెలో వుండిపోతా. వెండి గిట్ట దగ్గరగా వస్తుందేమో చూడచ్చు."

మొదట్లో ఆ ముసలాయన ఆ మాటలు చెవిన పెట్టలేదు.

‘‘చిన్న పిల్లని శీతాకాలంలో అడివిలోకి తీసుకు వెళ్లడమా? మామూలుగా వెళ్లలేం, స్కీలమీద వెళ్ళాలి, నీకు తెలీదు అది. మంచులో కూరుకుపోతావు. అప్పుడు యేం చెయ్యాలి నీతో? గడ్డకట్టి ముద్దయి పోతావు’’ అన్నాడు.

కాని దార్యోంకా అతన్ని వదల్లేదు. బతిమలాడుతూనే వుంది.

‘‘నన్నూ తీసుకెళ్ళు, నన్నూ తీసుకెళ్ళు, తాతా! నేను కొంచెం స్కీయింగ్ చేస్తా’’ అంది.

కొకొవాన్య ఆ మాటలూ యీ మాటలూ చెప్పి చూశేడు. ఆఖరికి అనుకున్నాడు:

"అయినా యీ అమ్మాయినీ కూడా తీసికెడితే యేమవుతుంది యింతా చేసి? ఓసారి అనుభవం అయితే యిక మళ్ళీ అడగదు."

"సరే అయితే. తీసుకెడతా. అడవిలోకి వెళ్ళాక యేడుపు మొదలెట్టద్దు, యింటి కెళ్ళిపోదాం అని పేచీ పెట్టద్దు, ఆఁ?" అన్నాడు.

శీతాకాలం నిజంగానే వచ్చేక కొకొవాన్య చేతితో లాగే స్లెడ్జి బండిమీద రెండు రస్కుల మూటలు యెక్కించేడు. కొన్ని వేట వస్తువులు యెక్కించేడు. యింకా వేరే చిల్లర వస్తువులు వేశాడు. దార్యోంకా కూడా తనూ వో చిన్న మూట తయారు చేసింది. బొమ్మకి గౌను తయారు చెయ్యడానికి కొన్ని పాత పీలికలు, వో దారం బండి, సూది తీసుకుంది. ఓ తాడు కూడా తీసుకుంది.

"దీంతో వెండి గిట్టని పట్టుకుంటా" అనుకుంది.

పిల్లిని వదిలిపెట్టడం బాధగానే వుంది, కాని యిక వేరే మార్గం లేదు మరి. ఆమె పిల్లిని నిమిరి, దాంతో మాట్లాడి దానికి అన్నీ వివరించి చెప్పింది.

"తాతా, నేనూ అడివిలోకి వెడుతున్నాం, పిల్లిపిల్లా! నువ్వింటి దగ్గరే వుండి చుంచుల్ని పట్టుకో. వెండి గిట్టని చూశాక యింటికి వచ్చేస్తాం, నీకు అంతా చెపుతాగా" అంది.

పిల్లిపిల్ల కొంటె కళ్ళతో చూసి గుర్‌మంది:

"అవును... స..స్స...రే."

అలా కొకొవాన్య, దార్యోంకా బయల్దేరారు. యిరుగుపొరుగు వాళ్ళంతా గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయేరు.

"యీ ముసలాడు గారం చేస్తున్నాడు. శీతాకాలంలో యిలాంటి చిన్న పిల్లని అడివిలోకి

తీసుకు వెళ్లడమా?" అనుకున్నారు.

కొకొవాన్య, దార్యోంకా యిళ్లు అన్నీ దాటి వెడుతూ వుంటే కుక్కలన్నీ గోల చేసి అరవడం, మొరగడం, గందరగోళంగా వుండడం వాళ్ల చెవిన పడింది. యేదో అడివి జంతువు చొరబడితే మొరిగినట్టుగా అవి మొరుగుతున్నాయి. వాళ్లు వెనక్కి తిరిగి చూశేరు. పిల్లి రోడ్డుకి అడ్డం బడి పరిగెత్తుకుంటూ వస్తోంది. అది కుక్కలని చూసి చీదరించుకుంటూ, శాపనార్థాలు కుమ్మరిస్తూ వస్తోంది. పిల్లి యిప్పుడు కొంచెం పెద్దది అయింది. బలం వచ్చింది. తన జాగ్రత్త తను చూసుకోగలదు. దానితో తలపడే కుక్క యెక్కడా లేదు.

దార్యోంకా దాన్ని పట్టుకుని యింటికి తీసికెళ్లి దిగబెట్టి వద్దామనుకుంది. కాని దాన్ని పట్టుకోబోవడమే! అది అడివిలోకి పరిగెత్తి వెళ్లి రెప్ప మూసి తెరిచే లోపల చెట్టు యెక్కేసింది. దాన్ని దింప చూడండి!

దార్యోంకా దిగు దిగు అని దాన్ని పిలిచింది, కాని అది లొంగలేదు. యిక వాళ్లేం చేస్తారు? యెదరకి సాగిపోవాల్సి వచ్చింది. వాళ్లు వెనక్కి తిరిగి చూస్తే పిల్లి పరిగెత్తు కుంటూ దగ్గరికి వస్తోంది. ఓ పక్కనుంచి వస్తోంది. ఆ రకంగా పిల్లితో సహా వాళ్లు గుడిసె చేరుకున్నారు.

వాళ్లు గుడిసెలో మకాం పెట్టారు. పిల్లి వాళ్లతోబాటే వుంది. దార్యోంకాకి గుడిసె, అదీ నచ్చేయి.

"యిక్కడ బాగుంది" అందామె.

కొకొవాన్య అవునన్నాడు:

"ఆఁ, ఉత్సాహంగా వుంది."

పిల్లి బంతిలా నెగడు దగ్గర ఉంగ చుట్టుకు పోయి గట్టిగా గుర్ మంది.

"అవును. మీరు స...స్స...రిగా అంతే."

ఆ యేడు శీతాకాలంలో చాలా మేకలు వచ్చేయి. మామూలు మేకలు. కొకొవాన్య రోజూ వొకటి రెండింటిని తెచ్చేవాడు. వాటి తోళ్ళు గుట్టగా పేరుకున్నాయి. వాటి మాంసం ఉప్పులో వూరేశారు. చేతి స్లెడ్జిలో మోసుకుని యింటికి తీసుకుపోలేనంత మాంసం వూరే శారు. యింటికి వెళ్లి వొక గుర్రాన్ని వెదికి తెచ్చుకోవాలని కొకొవాన్య అనుకున్నాడు. కాని దార్యోంకాని వొట్టి పిల్లిపిల్లతో వదిలిపెట్టి వెళ్లడం యెలాగ? కాని దార్యోంకా అడివిలో వుండడానికి అలవాటు పడింది. ఆమే ఆ విషయం గురించి చెప్పింది.

"తాతా! వూళ్లోకి గుర్రం కోసం వెళ్లరాదా? వూరేసిన మాంసాన్ని యింటికి తీసుకెళ్లాలి కదా మనం?"

కొకొవాన్య ఆశ్చర్యపోయేడు.

"చిన్న పిల్లవైనా యెన్ని తెలివి తేటలున్నాయి! పెద్ద వాళ్లలాగే యుక్తిగా వున్నావు. నీకే అనిపించిందా యిలాగ? కాని ఒక్కత్తెవీ వుండడానికి భయం వెయ్యదూ?"

"భయం దేనికి? యీ గుడిసె గట్టిగా వుంటుందని నువ్వే అన్నావు కదా? తోడేళ్లు లోపలికి రాలేవు. అదీగాక అవి యిక్కడికి రానూ రావు. నాకు పిల్లిపిల్ల తోడు వుంది. నాకేం భయం లేదు. కాని గబగబా వచ్చెయ్యేం?" అంది.

కొకొవాన్య బయల్దేరేడు. దార్యోంకా వెనక దిగడి పోయింది పిల్లితో. కొకొవాన్య మేకలని వెతకడానికి వెళ్లినప్పుడు ఒక్కత్తీ వుండడానికి అలవాటు పడింది. కాని చీకటి పడే వేళకి ఆమెకి కొంచెం బెదురు పట్టుకుంది. పిల్లికేసి చూసింది. అది హాయిగా తృప్తిగా పడుకొంది. దాంతో దార్యోంకాకి వూరట కలిగింది. ఆమె కిటికీ పక్కన కూర్చుని బయట

లోయకేసి చూసింది. అదుగో!... చిన్న బంతిలాంటిది యేదో అడివిలోనుంచి దొర్లుకుంటూ వస్తోంది. అది దగ్గరకంటా వచ్చింది. ఆమె గుర్తుపట్టింది దాన్ని... మేక. ఆ మేకకి సన్నని కాళ్లు వున్నాయి. తల నాజూగ్గా వుంది. దాని కొమ్ములకి అయిదు చిలవలు వున్నాయి.

దార్యోంకా వెంటనే బయటికి పరిగెత్తి వెళ్లింది. కాని అక్కడ యేమీ కనిపించలేదు. అలా చూసి చూసి యిక ఆఖరికి గుడిసె లోపలికి వెళ్లింది.

"కలగన్నానేమో! యేదో భ్రమ!" అంది.

"అ...వును... స...స్సరిగా అంతే!" అని పిల్లి గుర్‌మంది.

దార్యోంకా పిల్లిని కూడా తీసుకుని మంచం యెక్కింది. తెల్లవారే దాకా పిలిచినా లేవని గాఢ నిద్రపోయింది. మరో రోజు గడిచింది. కొకొవాన్య రాలేదు. దార్యోంకాకి ఒంటరిగా పొద్దు పోకుండా వుంది. కాని యేడవలేదు. అందుకు బదులుగా పిల్లిని నిమిరింది.

"మరేం బెంగపడకు పిల్లీ! తాత రేపు వస్తాడు! నువ్వే చూస్తావుగా!" అంది.

పిల్లి తన మామూలు పాట పాడింది:

"అవును... స...స్స...రిగా అంతే!"

మళ్లీ దార్యోంకా కిటికీ పక్కన చేరి నక్షత్రాలకేసి చూస్తూ కూర్చుంది. యిక నిద్రపోదామా అనుకుంటూ వుండగా గుడిసె గోడమీద టప్‌టుప్‌టప్‌మని చప్పుడవడం వినిపించింది. ఆమె బెదిరి గెంతింది. అవతల గోడమీద టపటప చప్పుడు వినిపించింది. తర్వాత తిరిగి మొదటి గోడమీద వినిపించింది. తర్వాత గుమ్మంమీద. ఆఖర్న కప్పుమీద వినిపించింది. ఆ చప్పుడు గట్టిగా లేదు, గబగబా వేసే అడుగుల చప్పుడులాగా వుంది.

హఠాత్తుగా దార్యోంకాకి వొక ఆలోచన తట్టింది. అది నిన్న వచ్చిన మేక అయితే?

ఆమెకి దాన్ని చూడాలని చాలా కోరికగా వుంది, భయం బెదురూ కూడా ఆమెని ఆపలేకపోయేయి. ఆమె తలుపు తెరిచి బయటికి తొంగి చూసింది. మేక వుందక్కడ. చాలా దగ్గరగా, చెయ్యి చాస్తే అందేటంత దగ్గరగా, వుంది అది. అది నేలమీద తాడించడానికి ముందు కాలు యెత్తింది. ఆ కాలిమీద వెండి గిట్ట తళక్ మంది. దాని కొమ్ములకి అయిదు చిలవలు వున్నాయి. దార్యోంకాకి యేం చెయ్యాలో తోచలేదు. అంచేత ఆమె దాన్ని 'మేమే' అని సాదా మేకనీ, మేక పిల్లనీ పిలిచినట్టు పిలిచింది.

ఆ మేక నవ్వినట్టు వినిపించింది. తర్వాత అది లోయలో పరిగెత్తి వెళ్లిపోయింది.

దార్యోంకా గుడిసెలోకి తిరిగివెళ్లి దీనంతటి గురించీ పిల్లికి చెప్పింది.

"నాకు వెండి గిట్ట కనిపించింది. దాని కొమ్ములు, దాని గిట్ట కనిపించేయి. అది నేలమీద తాటించడం, విలువైన వజ్రాలు పోగు పడడం మాత్రం కనిపించలేదు. యీ సారి చూపిస్తుందేమో వాటిని" అంది.

పిల్లిపిల్ల తన మామూలు పాట పాడింది:

"అవును. స...స్స...రిగా అంతే."

మూడో రోజు గడిచింది గాని కొకొవాన్య జాడ లేదు. దార్యోంకా ముఖం ముడుచుకు పోయింది. కొంచెం యేడ్చింది కూడా. పిల్లితో మాట్లాడాలనుకుంది. కాని పిల్లి యెక్కడికో వెళ్లిపోయింది. అప్పుడు దార్యోంకాకి నిజంగా భయం వేసింది. పిల్లిని వెతకడానికి వెళ్లింది.

అప్పుడు రాత్రి సమయం. పూర్ణిమ చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. దార్యోంకా చుట్టూ చూసింది. పిల్లి కనిపించింది. అది టీటమీద కూర్చుంది. దాని దగ్గర్లోనే మేక వుంది. అది కాలు యెత్తింది. దాని వెండి గిట్ట మెరిసింది.



పిల్లి తల ఆడిస్తోంది. మేకా అలానే ఆడిస్తోంది, అవి రెండూ మాట్లాడుకుంటూ వున్నట్టు. తర్వాత అవి మంచుమీద పరిగెత్తడం మొదలుపెట్టాయి.

మేక అటూ యిటూ పరిగెత్తి, అప్పుడు ఆగి, గిట్టతో నేలమీద తాటించింది. పిల్లి దగ్గరికి వచ్చింది, మేక దూరం వెళ్లిపోయింది. మళ్లీ ఆగి గిట్టతో తాటించింది. మళ్లీ అలానే జరిగింది.

అవి చాలా సేపు అలా పరిగెత్తుతూ వున్నాయి. తర్వాత దూరంగా వెళ్లి కనిపించకుండా మాయమైపోయేయి. తర్వాత తిన్నగా గుడిసె దగ్గరికి వచ్చేయి.

మేక గుడిసె కప్పుమీదకి యెగిరి వెండి గిట్టతో తాటించడం మొదలుపెట్టింది. నిప్పు రవ్వలాగా విలువైన రత్నాలు యెగిరిపడ్డాయి. అవి యెరుపు, ఆకుపచ్చ, ఆకాశ నీలం, ముదురు నీలంలాంటి అనేక రంగుల్లో వున్నాయి.

అప్పుడు కొకొవాన్య తిరిగివచ్చేడు. కాని అతను గుడిసెని గుర్తుపట్టలేకపోయేడు. అనేక రంగులతో కాంతులు విరజిమ్ముతూ వుండే విలువైన రత్నాలు గుడిసెని కప్పేశాయి. పైన మేక వెండి గిట్టతో తాడిస్తూ, తాడిస్తూ నుంచుంది. రత్నాలు రాశులు రాశులుగా పేరుకుంటూనే వున్నాయి.

యింతలోకీ పిల్లి వున్నట్టుండి మేక పక్కన మ్యావ్ మ్యావ్ మంటూ గట్టిగా అరుస్తూ నుంచుంది. తర్వాత పిల్లి కనిపించలేదు, మేకా కనిపించలేదు.

కొకొవాన్య సగం టోపీ నిండా రత్నాలని పోగులోనుంచి తీశేడు. కాని దార్యోంకా

“తాతా, వద్దు వద్దు అలానే వుండనీ! పొద్దుట వాటిని అలానే చూడాలని వుంది నాకు” అని బతిమలాడింది.

కొకొవాన్య సరేనన్నాడు. కాని తెల్లవారే లోపున దట్టంగా మంచు కురిసింది. అన్నీ కప్పడిపోయేయి.

తర్వాత వాళ్ళు మంచుని తీసేశారు. కాని వాళ్లకి యేమీ కనిపించలేదు. అయినా ఫరవా లేకపోయింది, యేమంటే కొకొవాన్య తీసిన సగం టోపీ రత్నాలు చాలు!

ఆ రకంగా అంతా సుఖంగానే ముగిసింది, పిల్లి మాత్రం సిగ్గు మాలిన పని చేసినా. అది మళ్లీ కనిపించలేదు. వెండి గిట్ట మేకా రాలేదు. ఒక్క సారి మాత్రమే అది వచ్చింది, చాలు.

కాని తర్వాత జనాలకి మేక పరిగెత్తి వెళ్లిన ఆ లోయలో విలువైన రత్నాలు దొరుకుతూనే వున్నాయి. వాటిలో చాలా భాగం ఆకుపచ్చవి. లోకులు వాటిని పచ్చలు అనేవాళ్లు. మీరెప్పుడేనా వాటిని చూశేరా?

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దీని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను "రాదుగ" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Raduga Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR